www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 25 అక్టోబర్ 2025 | 5 | కాకినాడ



తుని ఘటనపై పూర్తి విచారణ జరపాలి : సిపిఎం

ప్రజాశక్తి-కాకినాడ

తుని సోషల్ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థిని ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సోషల్ మీడియా విష సంస్కృతి, విచ్చలవిడి మద్యం వల్ల మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు దారుణంగా జరుగుతున్నాయన్నారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారిపైనే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని గమనించాలన్నారు. హాస్టల్ సిబ్బంది కూడా తల్లిదండ్రుల అనుమతి లేకుండా హాస్టల్ విద్యార్థులను ఇతరులతో పంపరాదన్నారు. బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా అధికార యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోగులకు సుస్తీ.. సేవలకు స్వస్తి..

- 25 రోజులుగా వైద్యం పూజ్యం
- ప్రైవేటు ఆస్పత్రుల్లో 'ఎన్‌టిఆర్ వైద్య సేవ' బంద్
- తీవ్ర ఇబ్బందుల్లో రోగులు
- పట్టించుకోని సర్కారు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

25 రోజులుగా పిహెచ్‌సి వైద్యులు తమ డిమాండ్ల సాధనకై ఆందోళన బాట పట్టారు. తొలుత నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు. అనంతరం అధికారిక వాట్సాప్ గ్రూపుల నుంచి వైదొలిగారు. గత నెల 29 నుంచి ఒపి సేవలను నిలిపివేశారు. ఆ తర్వాత జిల్లా కేంద్రం కాకినాడ డిఎం అండ్ హెచ్‌ఒ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. విజయవాడలో నిర్వహించిన దీక్షల్లో పాల్గొన్నారు. జిల్లా నలుమూలాల పలు ప్రాంతాల్లో దీక్షలు చేపట్టారు. ఇలా అనేక రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. మరోవైపు గత 16 రోజులుగా ప్రైవేట్ నెట్ వర్క్ ఆస్పత్రుల్లో 'ఎన్టీఆర్ వైద్య సేవ' పేరుతో నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ వైద్య సేవలు బంద్ అయ్యాయి. తొలుత ఎమర్జెన్సీ కేసులు నిలిపివేయగా కొద్ది రోజుల నుంచి సాధారణ ఒపి సేవలను సైతం నిలిపి వేశారు. దీంతో పేద, మధ్యతరగతి రోగులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఒక వైపు గ్రామీణ ప్రాంతాల్లో, మరోవైపు ప్రైవేట్ నెట్వర్క్ ఆసుపత్రులలో వైద్య సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో బాధిత రోగులు పడరాని పాట్లు పడుతున్నారు.

కాకినాడ జిల్లా కేంద్రంలో జిజిహెచ్‌తో బాటు 410 ఆరోగ్య ఉప కేంద్రాలు, కాకినాడ, సామర్లకోట, పిఠాపురం, పెద్దాపురం, గొల్లప్రోలు, ఏలేశ్వరం, తునిలో 23 అర్బన్ హెల్త్ క్లినిక్‌లు, 9 సిహెచ్‌సిలు, ఒక ఏరియా హాస్పిటల్స్‌తో బాటు 37 పిహెచ్‌సిలు ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు తమ డిమాండ్ల పరిష్కారం కోసం విధులను బహిష్కరించి సమ్మె బాట పట్టారు. దీంతో పేదలకు వైద్య సేవలు దూరం అయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందని పరిస్థితుల్లో పలువురు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. వైద్యం కోసం రూ.వేలల్లో సొమ్ములు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు వాపోతున్నారు. ఆయా పిహెచ్‌సిలలో సుమారు 150 మందికి పైగా సమ్మె బాటలో ఉండటంతో ప్రైవేట్ వైద్యం చేయించుకోలేని పలువురు కాకినాడ జిజిహెచ్‌కు క్యూ కడుతున్నారు. జిజిహెచ్‌లో 20 రోజులుగా రోగుల తాకిడి విపరీతంగా పెరిగింది. అన్ని విభాగాలూ కిక్కిరిసిపోతున్నాయి. ఇక్కడి వైద్యులు, సిబ్బందికి పని భారం విపరీతంగా పెరిగింది. ప్రభుత్వం స్పందించి పిహెచ్‌సి వైద్యుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ఆ దిశగా కనీస ఆలోచనలు చేయకపోవడం శోచనీయమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు కాకినాడలోని ప్రైవేటు హాస్పటల్ వద్ద ఉన్న బ్యానర్

ప్రభుత్వం నుంచి స్పందన కరువు

జిల్లాలో ప్రైవేటు నెట్వర్క్ ఆసుపత్రులకు దాదాపు రూ.115 కోట్లపైనే బకాయిలు ఉన్నాయి. నెలలు తరబడి ప్రభుత్వం ట్రస్ట్ ద్వారా బకాయిలు విడుదల కాకపోవడంతో విధి లేని పరిస్థితుల్లో ప్రైవేట్ నెట్వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు సేవలను నిలిపివేసి ఆందోళన బాట పట్టాయి. ప్రభుత్వానికి ఈ విషయంపై చీమకుట్టినట్టు లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి 19 ఏళ్ల గడుస్తోంది. ఏనాడూ ఇంత పెద్ద మొత్తంలో బకాయిలు పెండింగ్ లేవు. ఒకవేళ పెండింగ్ ఉన్నప్పటికీ యాజమాన్యాల ప్రభుత్వానికి విన్నవిస్తే రోజుల వ్యవధిలోనే సమస్యకు పరిష్కారం లభించేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు వారాల పైబడి బకాయిలు విడుదల చేయకపోవడం శోచనీయమని పలు యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఆరోగ్య శ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు మానుకోవాలని ప్రజలు ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి సూచిస్తున్నారు.

రోగుల పడరాని పాట్లు

అటు గ్రామీణ ప్రాంతాల్లో, ఇటు ప్రయివేటు నెట్వర్క్ ఆసుపత్రులలో కీలకమైన వైద్య సేవలు నిలిచిపోవడంతో పలువురు రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. ఎమర్జెన్సీ సర్వీసులు సక్రమంగా అందకపోవడంతో అనేకమంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. కొంతమంది పేదలు కాకినాడ జిజిహెచ్‌కు వస్తున్న గుండె వ్యాధి రోగులు మూడో నెంబర్ ఒపి వద్ద సేవలు పొందేందుకు వేకువఝామునే వచ్చినప్పటికీ ఇక్కడ గుండె వ్యాధి నిపుణులు లేకపోవడంతో వెనుదిరుగుతున్న పరిస్థితులు ఏర్పడ్డాయి. వారానికి ఒకసారి మాత్రమే విశాఖపట్నం కెజిహెచ్ నుంచి ప్రత్యేక వైద్యులు వచ్చి సేవలు అందిస్తున్నప్పటికీ ఇబ్బందులు కలుగుతున్నాయి. ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో భాగంగా ప్రస్తుతం నెట్వర్క్ ఆసుపత్రులలో సేవలు నిలిచిపోయిన కారణంగా జిజిహెచ్‌కు వస్తున్న రోగులకు నిరాశ తప్పడం లేదు. ఇలా వివిధ వైద్య సేవల కోసం అనేకమంది తీవ్రస్థాయిలో అవస్థలు ఎదుర్కొంటున్నారు.



వైద్యం కోసం ఇబ్బంది పడుతున్నాము

ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా గుండె వ్యాధి కోసం చికిత్స చేయించుకుందామని ప్రైవేటు ఆసుపత్రికి వెళితే అక్కడ వైద్య సేవలు అందడం లేదని తెలిసింది. దీంతో కాకినాడ జిజిహెచ్‌కు వచ్చాను. ఇక్కడ రోగుల తాకిడి ఎక్కువగా ఉంది. గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి నెట్వర్క్ ఆసుపత్రులలో సేవలు అందేలా చూడాలి. జిజిహెచ్ లో వైద్య నిపుణులను నియమించాలి.

- కె.సీతబాబు, గుండె వైద్యం కోసం వచ్చిన రోగి, తుని.



సమస్యలు పరిష్కరించాలి

ప్రైవేటు నెట్వర్క్ ఆసుపత్రుల ద్వారా పలువురు రోగులకు వైద్య సేవలను అందిస్తున్నాము. సిబ్బంది వేతనాలు, నిర్వహణ ఖర్చులు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నెలలు తరబడి ప్రభుత్వం బిల్లులను పెండింగ్ ఉంచితే ఎలా.. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి.

- డాక్టర్ ఎన్. ఉమ, ఎండి, ట్రస్ట్ హాస్పిటల్, కాకినాడ.

ఖాళీ స్థలాలకు పన్నులు చెల్లించాలి

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ నగరంలో ఖాళీ స్థలాల పన్ను వసూలుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. 2015-16 తర్వాత ఇప్పటివరకు పన్నుల హేతుబద్ధీకరణ చేపట్టలేదని, రాష్ట్రంలోని ఇతర మున్సిపల్ కార్పొరేషన్ల నమూనాలను పరిశీలించి పన్నుల్లో మార్పులు తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. నగరంలోని అనేక ఖాళీ స్థలాల యజమానులు ఇప్పటికీ పన్నులు చెల్లించలేదని తెలిపారు. ఈ ఖాళీ స్థలాలకు రానున్న నవంబర్ 25 నాటికి వంద శాతం పన్నులు చెల్లించాలని ప్రత్యేకాధికారి, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఖాళీ స్థలాల యజమాన్యాలను గుర్తిస్తామని, పన్నులు చెల్లించని స్థలాలను ప్రభుత్వం 22(ఎ) జాబితాలో చేర్చి స్వాధీనం చేసుకునే చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి శిరీష్, ఇన్‌స్పెక్టర్లు అయోధ్యరాం, అశోక్, ప్రసాద్ పాల్గొన్నారు.



రెవెన్యూ సిబ్బందితో సమీక్షిస్తున్న డిప్యూటీ కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న రాజబాబు

ధాన్యానికి బోనస్ ప్రకటించాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

ధాన్యానికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ప్రకటించాలని కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం ప్రజా సంఘాల భవనంలో చల్లా సంతోష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ రైతులు అనేక కష్టాలు పడి పంటలు పండిస్తున్నా పంట పండినప్పటికీ మద్దతు ధర రాకపోవడంతో అప్పుల పాలవుతున్నారన్నారు. ఒకపక్క పెరుగుతున్న ఎరువులు, పురుగు మందులు ధరలు మరోపక్క యంత్రాల ఖర్చులు విపరీతంగా పెరగడంతో రైతాంగం అప్పులు పాలవుతోందన్నారు. ఇటువంటి పరిస్థితిని ఎదుర్కొనేందుకు కేంద్రం ఇస్తున్న మద్దతు ధరతో పాటు కేరళలో రూ.900 బోనస్ ఇస్తున్నారని, తెలంగాణలో రూ.500 బోనస్ ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. మన రాష్ట్రంలో కూడా రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలివెల సింహాచలం, పిల్లి నాని, పంచగల రామకృష్ణ, గుత్తుల సూర్యనారాయణ, గోవాల ఏడుకొండలు, వాసంశెట్టి సత్యనారాయణ, దడాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆదిత్య ప్రొఫెసర్ స్నేహలతకు డాక్టరేట్

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ స్నేహలత జేనా విట్-ఎపి యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించినట్టు ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ప్రొఫెసర్ డా.మనోజ్ కుమార్ మిశ్రా నేతృత్వంలో స్నేహలత సమర్పించిన థీసిస్‌పై ఈ డాక్టరేట్ పొందారని తెలిపారు. స్నేహలత భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, ఎంబి.శ్రీనివాస్. ప్రో. వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డాక్టర్ రవి తంగజన్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, విభాగాధిపతి. డాక్టర్ ఎ.వానతి పాల్గొన్నారు.

బాలికకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కోటనందూరు

అత్యాసారానికి గురైన బాలికకు రాజకీయ పార్టీలకతీతంగా శుక్రవారం రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించారు. బాలికకు వైద్య ఖర్చులకు, విద్యాపరంగానూ ఉన్నత చదువులు చదివించడానికి తోడ్పాటు అందిస్తామని అన్నారు. ఏలూరి సుధాబాబు, రాయి మేరీ అవినాష్, లంక కృపానందం, కర్రి సత్య జగదీష్, నక్కా జాన్ ఆనంద్, బోడపాటి సతీష్, చింతల లక్ష్మణ్, బండి నాని, కాసే కపిల్, కాకడ శివ, సాక వెంకటేష్, త్యాడి శంకర్రావు, శివారెడ్డి, పలివెల దయమల్లిక్, తాతపూడి చరణ్ పాల్గొన్నారు.



వరదను పరిశీలిస్తున్న సునీల్

పొలాల ముంపుపై చర్యలు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

భారీగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు ముంపునకు గురికాకుండా ముందస్తుగా వరద నీరును సముద్రంలోకి మళ్లించే చర్యలను చేపట్టినట్లు ప్రాజెక్ట్ చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ శుక్రవారం తెలిపారు. పిఠాపురం బ్రాంచ్ కెనాలకు ఛానల్ వద్ద కలిసే ఏలేరు జలాశయం నుంచి వర్షాల కారణంగా దిగువకు విడుదలవుతున్న వరద నీరు వల్ల పిబిసి పంట పొలాలు ముంపునకు గురికాకుండా సముద్రంలోకి ముందస్తుగా వరద నీరును మళ్లించే చర్యలు చేపట్టినట్టు తెలిపారు. డిఇ సంతోష్ కుమార్, విఆర్ఒ మురళి, సత్యనారాయణ ఉన్నారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణపై వైసిపి నిరసన

ప్రజాశక్తి-కాకినాడ, ప్రత్తిపాడు

రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కాకినాడ మాజీ ఎంఎల్ఎ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అధ్యర్యంలో శుక్రవారం సంతకాలను సేకరించారు. ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ద్వారంపూడి మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్య విద్య అందకుండా చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జెడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రజాధనంతో నిర్మాణం ప్రారంభమైన పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ మేనేజ్‌మెంట్‌కు అప్పగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం దారుణం అన్నారు. విద్యార్థుల నుంచి వైద్య నిపుణుల వరకు అందరిలోనూ ఈ నిర్ణయం ఆందోళన రేపుతోందన్నారు. మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న సాగర్, రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, కిషోర్, పసుపులేటి వెంకటలక్ష్మి, పెద్ది రత్నాజీ, రాగిరెడ్డి అరుణ్ కుమార్, కంపర బాబీ, సంఘాని నందం, యార్లగడ్డ లక్ష్మి శ్రీరామచంద్రమూర్తి, బషీరుద్దీన్, ఆలీ, బెజ్జంగి సుధాకర్, వరిపల్లి కృష్ణవేణి, దాకరపు వరప్రసాద్, పంతాడి బ్రహ్మానందం, తదితర వైసిపి నాయకులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

ప్రత్తిపాడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వైసిపి కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. ప్రత్తిపాడు లయన్స్ క్లబ్‌లో పార్టీ శ్రేణులు ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించే ప్రజా ఉద్యమ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిరిబాబు పిలుపునిచ్చారు. మెడికల్ కళాశాల మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రత్తిపాడులో కోటి సంతకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ పరిశీలకులు ఒమ్మి రఘురాం, జెడ్‌పిటిసి బెహరా రాజేశ్వరి, జిల్లా ఉపాధ్యక్షుడు బెహర దొరబాబు, రామిశెట్టి నాని, జల్లిగంపల ప్రభాకర్, గుడాల వెంకటరత్నం, మదినె నూకరాజు, రెడ్డి నాయుడు పాల్గొన్నారు.




కాకినాడలో సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

కమిషనర్‌గా సుధాకర్‌కు అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి-కాకినాడ

నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ కెటి.సుధాకర్‌కు కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర మున్సిపల్ కమిషనరేట్ డైరెక్టర్ డాక్టర్ పి.సంతోష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సుధాకర్ మున్సిపల్ కమిషనర్‌గా పూర్తి బాధ్యతలు నిర్వర్తించనున్నారు. తదుపరి ఉత్తర్వుల జారే అయ్యే వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ అధికారులు సుధాకర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఇ వెంకట్రావు, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, టిపిఆర్ఒ శైలజ, ఇతర అధికారులు సుధాకర్‌ను కలిశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ సుధాకర్

దాతల సహకారం ప్రశంసనీయం

ప్రజాశక్తి-శంఖవరం

సత్యదేవుని సన్నిధిలో యాత్రికుల సౌకర్యార్థం దాతలు సహకారం ప్రశంస నీయమని ప్రత్తిపాడు ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. శుక్రవారం కొండపైన పశ్చిమ రాజగోపురం ఎదురుగా దేవస్థానం ఇఒ సుబ్బారావు, చైర్మన్ ఐవి రోహితుల సమక్షంలో విశాఖపట్నంకు చెందిన లారెన్స్ ల్యాబ్ సంస్థ సహకారంతో సుమారు రూ.2.5 కోట్ల వ్యయంతో యాత్రికులు సేద తీరేందుకు విశ్రాంతి హాలు బుకింగ్, ప్రసాదం కౌంటర్లు టెన్షన్ షెడ్డు వంటి మౌలిక వసతులతో కూడిన నిర్మాణ సముదాయాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ సత్యప్రభ మాట్లాడుతూ సదుపాయాలు కల్పించేందుకు మరింత మంది దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇఒ సుబ్బారావు అమ్మవారి పట్టు వస్త్రాలను, ప్రసాదం ఎంఎల్ఎకు అందించారు ఈ కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు రవికుమార్, నరసింహారావు, సర్పంచ్ కుమార్ రాజా, కూటమి నాయకులు వెన్న శివ, అవంతి బాబి, సుభాష్, వాసు నరసయ్య, రాజాల చిట్టిబాబు, చక్రి పాల్గొన్నారు

శంకవరం న్యూస్ వన్ ఫోటో



సముదాయాన్ని ప్రారంభించిన ఎంఎల్ఎ సత్యప్రభ

పట్టు పురుగు గూడు కట్టక రైతుల ఆవేదన

ప్రజాశక్తి-గొల్లప్రోలు


మండలంలోని చేబ్రోలులో పట్టు పురుగులు గూడు కట్టక పట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు. శుక్రవారం దీనిపై స్థానిక పట్టు పరిశ్రమ కేంద్రం వద్ద పట్టు రైతులతో సెరికల్చర్ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మైసూర్ సెంట్రల్ సిల్క్ బోర్డు సైంటిస్ట్ భాగ్య పాల్గొని మాట్లాడారు. రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పురుగు మందుల వల్ల పట్టుపురుగులు గూడు కట్టకపోవడం దానిపై శాంపిల్స్ సేకరించామని రిపోర్టు రాగానే దానిపై చర్యలు చేపడతామన్నారు. అనంతరం రైతులు ఓరుగంటి శివ, ఉలవకాయల రాంబాబు, నానాజీ ఆమెకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్ల నుంచి కష్టపడి పంట వేసినా పట్టు పురుగులను పెంచి పురుగు గూడు కట్టక పంట చేతికి రాక చాలా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. పురుగులు పూర్తిస్థాయిలో ఎదిగి బాగా ఆహారం తీసుకుని కూడా గూళ్ళ కట్టడం లేదని దీనివల్ల రూ.లక్షల్లో నష్టపోతున్నామన్నారు. పత్తి పంట దగ్గరలోని రేరింగ్ షెడ్‌లో పంటలు పండడం లేదని ఈ విషయాన్ని అనేకసార్లు అధికారులకు సైంటిస్టులకు కూడా విన్నవించామని తెలిపారు. పత్తి రైతులు పురుగు మదులు అధికంగా వాడడం చేత పట్టు రైతులం ఇబ్బంది పడుతున్నామని దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెరికల్చర్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్ బాబు, చేబ్రోలు సెరికల్చర్ సైంటిస్ట్ డాక్టర్ భువనేశ్వరి, ఎఎస్ఒ సత్యనారాయణ, రైతులు ఓరుగంటి, చక్రధర్ చల్లా రామకృష్ణ పాల్గొన్నారు.



అవగాహనా సమావేశంలో పాల్గొన్న పట్టు రైతులు



కార్టూ'నిజం'





పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి విజయ్ కుమార్

3,100 ఎకరాల్లో పంట నష్టం

ప్రజాశక్తి- తాళ్లరేవు

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాప్తంగా నేటికి 3,100 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు ప్రాథమికంగా గుర్తించామని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. ఇంజరంలో నీట మునిగిన పంట పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా రెండు లక్షల 25 వేల ఎకరాల్లో వరి సాగు చేశారని తెలిపారు. 9 మండలాల్లో 77 గ్రామాల్లో ఈ నష్టం గుర్తించామని, మరో రెండు రోజుల్లో రానున్న వర్షాలకు మరింత నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. ఎడి బాబూరావు, ఒఎ ప్రశాంతి, డిసి చైర్మన్ వేగేశ్న భాస్కరరాజు, ఇంజరం సర్పంచ్ ముద్దన శివరామ్ ప్రసాద్, కోరుకొండ కిరణ్ కుమారి, చంటి పాల్గొన్నారు.



చిత్రపటం, ప్రసాదాలు అందజేస్తున్న ఎసి విజయలక్ష్మి

ఆలయాలను సందర్శించిన హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-పెద్దాపురం

ఎపి హైకోర్టు న్యాయమూర్తి మాందేతి సీతారామమూర్తి కుటుంబ సమేతంగా శుక్రవారం పట్టణంలోని మరిడమ్మ అమ్మవారిని, మండల పరిధిలోని తిరుపతి శృంగార వల్లభ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు రెండు ఆలయాలలో ఆలయ మర్యాదలతో, పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదాశీర్వచనాలతో వారికి శేష వస్త్రాలు, చిత్రపటాలు, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.చంద్రమౌళీశ్వరి, మరిడమ్మ ఆలయ ఎసి కె.విజయలక్ష్మి, శృంగార వల్లభ స్వామి ఆలయ ఇఒ వడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

77 హెక్టార్లలో నేలకొరిగిన వరి పంట

ప్రజాశక్తి -కరప

అల్పపీడన కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో 77 హెక్టార్లలో వరి పంట నేలకొరిగిందని వ్యవసాయ అధికారిని ఐ.సత్య పేర్కొన్నారు. రైతులు నేలకు ఒరిగిన పంటను రక్షించుకుందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాలు పోసుకునే దశలో ఉన్న వరి పొలాలను పైకి లేపి కట్టడం ద్వారా నష్టాన్ని అరికట్టవచ్చు అన్నారు. పూర్తిగా పంట దశకు వచ్చిన వరి పొలాలకు మడులలో నీరు పోయే విధంగా బాటలు ఏర్పాటు చేసుకుని ఉప్పునీటి ద్రావణాన్ని స్ప్రే చేసుకోవడం వల్ల మొలక నివారణను అరికట్టుకుని నష్టాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులు గింజలు గట్టిపడే దశలో ఉన్నప్పుడు తాలు గింజలు ఏర్పడకుండా కార్బన్డిజం లీటర్ నీటికి రెండు గ్రాములు చెప్పిన కలిపి వరిపై పిచికారి చేస్తే తాలు గింజలు రాకుండా నివారించి వచ్చని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ ప్రశాంత్ పాల్గొన్నారు.

పందుల సంచారంపై నియంత్రణ

ప్రజాశక్తి పెద్దాపురం

పట్టణ పరిధిలోని నివాస ప్రాంతాలలో పందులు తిరగకుండా వాటి యజమానులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పందుల పెంపకందారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి, మున్సిపల్ ప్రజా ప్రజా ప్రతినిధుల నుండి పట్టణ పరిధిలో పందులు సంచరిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. పందులు బయట తిరగకుండా నియంత్రించాలని హెచ్చరించారు. పట్టణ పరిధిలో పారిశుధ్య నిర్వహణపై సానిటరీ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మెరుగుదలకు పలు సూచనలు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని మెప్మా విభాగంలో మెప్మా సిబ్బందికి పురమిత్ర యాప్ డౌన్లోడ్స్ పై చేపట్టిన కార్యక్రమాలను సమీక్షించి డౌన్లోడ్స్ పెంచాలని ఆదేశించారు. సానిటరీ ఇన్స్పెక్టర్ బి ఆదినారాయణ,మెప్మా సీఎం ఎం జి భ్రమరాంబ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

భార్యపై దాడి కేసులో భర్త అరెస్టు

ప్రజాశక్తి - పి.గన్నవరం

భార్యపై చాకుతో గాయపరిచిన భర్త నేలపూడి గంగరాజును శుక్రవారం ఉడిమూడిలో అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామని పి.గన్నవరం ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. దీపావళి రోజు రాత్రి నిందితుడు గంగరాజు తన భార్య పల్లాలమ్మను చాకుతో చంపుతామని బెదిరించి, కత్తితో గొంతులో ఆమె పొడిచాడు. ఈ ఘటనలో ఆమె తల తిప్పడంతో కంటి పై భాగంలో బలంగా గాయమైంది. కాకినాడ జిజిహెచ్‌లో సర్జరీ చేసి చాకును తీశారు. దీంతో ఆమె చికిత్స పొందుతోంది. నిందితుడు గంగరాజును కొత్తపేట మెజిస్ట్రేట్ ముందు హాజరపరిచి రిమాండ్‌కి పంపించినట్లు ఎస్ఐ తెలిపారు.

నాలుగు ఇసుక లారీల స్వాధీనం

ప్రజాశక్తి - కొవ్వూరు

అధిక లోడుతో వెళ్తున్న నాలుగు ఇసుక లారీలను అధికారులు పట్టుకున్నారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ చైర్మన్, కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు శుక్రవారం కొవ్వూరులో జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు ఇసుక ర్యాంపులను తనిఖీ చేశారు. దొండగుంట గ్రామంలోని డిసిల్టేషన్ రీచ్ వద్ద పరిమితికి మించి అధిక లోడ్‌తో వెళ్తున్న నాలుగు లారీలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకని తదుపరి చర్యల కోసం సంరక్షణ నిమిత్తం కొవ్వూరు పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పబ్బితి రెడ్డి సుధీర్ రెడ్డి పేరుతో ఎన్‌టిఆర్ జిల్లా గంపలగూడెం రాజవరం గ్రామానికి నాలుగు లారీల్లో ఒక్కొక్క లారీకి సుమారు 36 టన్నుల ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 12 నుంచి ఈ నెల 23 మధ్య మొత్తం 2071 మెట్రిక్ టన్నుల ఇసుక పొందినట్లు అధికారులు గుర్తించారు. రాజవరంలో అధికారులు తనిఖీ చేసినప్పుడు ఎటువంటి ఇసుక నిల్వలు లేవని నిర్ధారించారు. ఈ ఇసుక తెలంగాణ రాష్ట్రానికి రవాణా చేస్తున్నట్లు గుర్తించామని మైనింగ్ ఎడి ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ డి.జ్యోతిర్మయి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకురాలి అరెస్ట్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

కూటమి నాయకుల ఫ్లెక్సీల రూపురేఖలను మారుస్తోందనే అభియోగంపై వైసిపి మహిళా విభాగం నాయకురాలు అనుని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంట్లో ఉండగానే పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని త్రీ టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ భరత్ తన అనుచరులతో త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. అను అరెస్ట్‌పై పోలీసులను నిలదీశారు. ఈ సందర్భంగా పోలీసులకు, వైసిపి నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. తమ నాయకులను, కార్యకర్తలను కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేస్తోందని, వేధింపులకు గురి చేస్తోందన్నారు. బాలిక అత్యాచార ఘటనపై శాంతియుతంగా ధర్నా చేశాం తప్ప ఎవర్నీ అగౌరవ పర్చలేదన్నారు. గురువారం బిసి హాస్టల్ వద్ద వైసిపి నిర్వహించిన ధర్నా సమయంలో సమీపంలోని గోడలపై కూటమి నాయకుల ఫ్లెక్సీల రూపురేఖలను అను మార్చారనే అభియోగంపై అనుపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. భరత్ వెంట మజ్జి రాంబాబు, గుర్రం గౌతమ్ పాల్గొన్నారు.



రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బ్యాగులు

140 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - సామర్లకోట

టాటానగర్-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా రవాణా చేస్తున్న 140 కేజీల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.7లక్షల వరకూ ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 12.45 గంటలకు రైలు సామర్లకోట రైల్వే స్టేషన్‌లో మూడో నెంబర్ ప్లాట్‌ఫామ్‌కి చేరుకుంది. ఈ సమయంలో ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి బృందాలు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాయి. ఎస్1 నుంచి ఎస్6 వరకు ఉన్న స్లీపర్ బోగీలను పరిశీలించగా యజమానులు లేని 15 సంచులు లభించాయి. వాటిలో గంజాయి ప్యాకెట్లు గుర్తించారు. వాటిని తూకం వేయగా 140 కేజీలు ఉన్నట్టు గుర్తించారు. మేరకు కేసును నమోదు చేశారు. ఈ సంచులు ఎవరు తీసుకొచ్చారనే దానిపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఆర్‌పిఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, జిఆర్‌పి ఎస్ఐ వాసు, ఎఎస్ఐలు వరప్రసాద్, సత్యనారాయణ, పెద్దిరాజు పాల్గొన్నారు.

కోర్టు కేసులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

కోర్టు కేసుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో కౌంటర్లు, అవసరమైన కేసుల్లో అప్పీలు దాఖలు చేయాలని కమిషనర్ రాహుల్‌మీనా ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ హాల్లో శుక్రవారం అన్ని విభాగాల హెచ్‌ఒడిలతో ఆయన సమావేశం నిర్వహించారు. కోర్టు కేసులకు సంబంధించి ముఖ్యంగా ధిక్కారం కేసులపై అధికారులు తక్షణం స్పందించాలన్నారు. ఏదైనా కోర్టు ఉత్తర్వులు ఉంటే వాటిని అమలు చేయాలని, లేదంటే కౌంటర్లు, అప్పీళ్లు దాఖలు చేయాలన్నారు. అత్యధికంగా టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై దృష్టి పెట్టాలన్నారు. ప్రాథమిక దశలోనే ప్రభుత్వ ఉత్తర్వులు గాని, సూచనలు గాని కోర్టుకు అందిస్తే, కోర్టు వారు ఆ కేసును అనుమతించరన్నారు. మధ్యంతర ఉత్తర్వులు వస్తే వాటిని అమలు చేసి పక్కాగా రికార్డు చేసుకోవాలన్నారు. కోర్టు ధిక్కరణ ఎట్టి పరిస్థితుల్లోనూ కాకూడదని స్పష్టం చేశారు. వచ్చే సమావేశానికి శాఖల వారీగా ప్రోగ్రెస్ చూపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, అన్ని విభాగాల హెచ్‌ఒడిలు పాల్గొన్నారు.

యానాం వార్తలు



ఆర్ఎఒ అంకిత్ కుమార్‌తో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

రోడ్ల పనులపై ఎంఎల్ఎ ఆగ్రహం

ప్రజాశక్తి - యానాం

యానాంలో పలుచోట్ల రహదారుల మరమ్మత్తు పనులకు టెండర్లు పూర్తయ్యి వర్క్ ఆర్డర్లు ఇచ్చి నెలలు గడుస్తున్నా పనులు మొదలుపెట్టక పోవడంపై ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆర్ఎఒ అంకిత్ కుమార్‌ను కలిసి పలు అభివృద్ధి పనులపై ఆయన మాట్లాడారు. పలుచోట్ల రహదారులు గోతులతో నిండియున్నాయని వాటి మరమ్మత్తులకు మూడు పనులు చొప్పున టెండర్లు అనంతరం వర్క్ ఆర్డర్లు ఇవ్వడం సైతం జరిగాయన్నారు. ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడంతో కురుస్తున్న భారీవర్షాలకు వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వర్షం లేనప్పుడు పనులు మొదలుపెడితే ఇప్పటికే పూర్తయ్యేవన్నారు. రోడ్డు ప్రమాదాలకు అధికారులు, సంబంధింత కాంట్రాక్టర్‌లు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సంబంధిత కాంట్రాక్టర్ టిఎస్.రాజేశ్వరరావు పనులు ప్రారంభించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరిలో ఒన్‌జిసి గ్యాస్ పైపులైను నుంచి శుక్రవారం మళ్లీ గ్యాస్ లీకేజీ అవుతున్న నేపథ్యంలో ఒఎన్‌జిసి అధికారులతో మాట్లాడానని ఎంఎల్ఎ అశోక్ తెలిపారు. ఆర్ఎఒ అంకిత్‌కుమార్ మాట్లాడి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు.

రవితేజకు రజత, కాంస్య పతకాలు

ప్రజాశక్తి - యానాం

ఆస్ట్రేలియా కాన్ బెర్రాలో అక్టోబర్ 24న నిర్వహించిన ఆస్ట్రేలియన్ మాస్టర్స్ పోటీలలో యానాం ఎస్‌టిసి అసిస్టెంట్ స్విమ్మింగ్ కోచ్ గ్రంధి రవితేజ రెండు పతకాలు సాధించినట్లు శాయ్ శిక్షణా కేంద్రం ఇన్‌ఛార్జి ఉదయ్ శుక్రవారం తెలిపారు. రవితేజ 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో రజత పతకాన్ని, 25 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో కాంస్య పతకాన్ని సాధించాడన్నారు. ఈ సందర్భంగా రవితేజను అభినందించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

ఏలేరు పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ సూచించారు. శుక్రవారం ఆయన టిడిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అకాల వర్షాల కారణంగా ఏలేరు జలాశయం నిండుకుండలా మారిందని, రోజుకు 2,100 క్యూసెక్కుల నీరు దిగువ ప్రాంతానికి వదులుతున్నట్టు తెలిపారు. 2,500 క్యూసెక్కుల నీరు కిందకు వదిలితే కిర్లంపూడి మండలం కృష్ణవరం, ఎస్.తిమ్మాపురం, శృంగరాయునిపాలెం, భూపాలపట్నం, రాజుపాలెం గ్రామాలకు ముంపు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.



ఫీజు రాయితీ లెటర్‌ను ఎంఎల్ఎ నెహ్రూకు అందజేస్తున్న విద్యార్థిని

ప్రజల నుంచి వినతుల స్వీకరణ

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ శుక్రవారం ఇర్రిపాకలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. బి.టెక్ సిఎస్ఇ చదువుకు ఫీజు కట్టలేని జగ్గంపేట గ్రామానికి చెందిన రిషిత ఫీజు కోసం మంత్రి లోకేష్‌కు అర్జీ పెట్టుకుంది. ఫీజు తగ్గించాలని కైట్ విద్యా సంస్థల చైర్మన్ విశ్వంకు మంత్రి లెటర్ వ్రాశారు. ఆ లెటర్‌ను రిషిత ఎంఎల్ఎకు అందజేశారు. నియోజకవర్గంలోని డ్రైనేజీ, కాలువలు నిర్మాణం వంటి సమస్యలకై వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, టిడిపి మండల అధ్యక్షులు జీను మణిబాబు, మణికర్ణిక యువజన సంఘం అధ్యక్షురాలు గున్నాబత్తుల అనూష పాల్గొన్నారు.

తిరుమాలిలో పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని తిరుమాలిలో శుక్రవారం జిల్లా పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 50 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడంతో పాటు 300 పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేశామని సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ కాంతారావు తెలిపారు. ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం పెయ్య దూడలు పుట్టించే వీర్యాన్ని రూ.500 నుంచి రూ.150కు తగ్గించిందన్నారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రతి రైతు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు సహాయ సంచాలకులు డాక్టర్ యోగేశ్వర్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ సాయికృష్ణ, గ్రామ సర్పంచ్ సూతి వీరకృష్ణ ప్రసాద్, కూటమి నాయకులు సూది వీర ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

వర్షంతో నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి-రౌతులపూడి

మండలంలో శుక్రవారం ఉదయం నుంచి జోరుగా వర్షం కురిసింది. దీంతో ప్రజల రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఆయా గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జోరు వానతో జలమయం అయ్యాయి. నాలుగు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు పత్తి పంట దెబ్బతింటుందని సాగు చేస్తున్న రైతులు దిగులు చెందుతున్నారు. చేతికి వస్తున్న సమయంలో వర్షాలు పడుతుండడంతో కాయ కుళ్లిపోయి నష్టం వాటిల్లుతుందని దిగులు చెందుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ఆర్‌టిసి డిపోలో మహా అన్నదానం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

స్థానిక ఎపిఎస్ఆర్‌టిసి డిపో ఆవరణలో శుక్రవారం ప్రముఖ పారిశ్రామికవేత్త, యువిఆర్ సంస్థల ఎండి ఉమ్మడి వెంకట్రావు ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 5000 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చిలుకూరి రామకుమార్, అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, యువిఆర్ సంస్థల సిబ్బంది ఉన్నారు.

కీటక నియంత్రణపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని తాటిపర్తి, విజయనగరంలో కీటక నియంత్రణ పద్ధతులపై ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. టమాటో, పచ్చిమిర్చి, బెండ, బొప్పాయి, జామ పంటల్లో సమీకృత కీటక నియంత్రణ వివిధ కీటక వ్యాధులు గుర్తింపు నివారణ చర్యలు, జీవన ఎరువుల వినియోగంపై ప్రిన్సిపల్ సైంటిస్ట్ మానుకొండ శ్రీనివాస్ వివరించారు.

ఆదిత్య కళాశాలలో వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక సాంబమూర్తి నగర్‌లోని ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ట్రాన్స్ఫర్ యువర్ సెల్ఫ్ టు ట్రాన్స్ఫర్ వరల్డ్ అనే అంశంపై వ్యాసరచన పోటీలకు నిర్వహించారు. ఈ పోటీలలో బహుమతులు సాధించిన విద్యార్థినులను అభినందించారు. సత్యసాయి సేవా సమితి డాక్టర్ డిఎన్‌వి శ్యామల పర్యవేక్షణలో ఈ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ కె.కరుణ, వైస్ ప్రిన్సిపల్ జి.నాగశ్రీకాంత్ మాట్లాడుతూ తమ కళాశాలలో సిహెచ్.శ్రీసత్యలక్ష్మి ప్రథమ బహుమతి, ఎం.మౌనిక ద్వితీయ బహుమతి, పి.అక్షిత రెడ్డి తృతీయ బహుమతి సాధించినట్టు తెలిపారు.

విద్యార్థుల భౌగోళిక ప్రాంతాల సందర్శన

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు భౌగోళిక శిలలపై అధ్యయనం కోసం విద్యా పర్యటన నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. విద్యార్థులు రామేశంపేట వద్ద లేటరైట్ శిలలను పరిశీలించి, వాటి నిర్మాణ ప్రక్రియలు, ఇంజినీరింగ్ ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. అనంతరం గొరిపట్నం వద్ద బాసాల్ట్, కందరపాట శిలల లక్షణాలు, వాటి పారిశ్రామిక ఉపయోగాలపై అవగాహన పొందారు. ఈ పర్యటన విద్యార్థులకు తరగతి గదిలో నేర్చుకున్న సిద్ధాంతాలను ప్రాకృతిక ప్రదేశాల్లో అన్వయించుకునే అవకాశాన్ని ఇచ్చింది. సివిల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ఇలాంటి ఫీల్డ్ ట్రిప్‌లను పాఠ్యాంశంలో భాగంగా కొనసాగిస్తున్నట్టు విభాగాధిపతి డాక్టర్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తుని ఘటనపై సమగ్ర విచారణ చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

తుని గురుకుల పాఠశాల ఘటనపై సమగ్ర విచారణ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. కచేరిపేటలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు మాట్లాడారు. తునిలోని గురుకుల పాఠశాలలో సుమారు 473 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. వీరందరికీ కేవలం 10 రూములు మాత్రమే ఉన్నాయన్నారు. ఒక్కొక్క రూములో 80 మంది చొప్పున నాలుగు రూముల్లో ఉంటున్నారన్నారు. మిగిలిన విద్యార్థులు చాలీచాలని గదుల్లో ఒకే గదిలో అక్కడే క్లాసులు, అక్కడే పడుకునే పరిస్థితి ఉందన్నారు. ఈ హాస్టల్‌కు గ్రౌండ్ లేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నడుస్తున్న ఈ హాస్టల్లో అమ్మాయిల హాస్టల్ అయినా కనీసం పర్మినెంట్ వాచ్‌మెన్ పోస్ట్ కూడా లేదన్నారు. అధికారులు నిరంతరం హాస్టల్ పర్యవేక్షణ చేయకపోవడం వల్ల ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. పగడాల, సత్యం, పి.జైరామ్ పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీల్లో ఆదిత్య విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు రామకృష్ణ మిషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో అత్యధికమంది పాల్గొన్నట్టు ఆదిత్య డిగ్రీ, పిజి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు తెలిపారు. తమ కళాశాల నుండి 313 మంది విద్యార్థులు అత్యధిక సంఖ్యలో వ్యాసరచన పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీలలో నాలుగో స్థానంలో నిలిచిన ఎస్.శ్రావ్య నగదు బహుమతితో పాటు వివేకానందుని సాహిత్యం, ప్రశంసా పత్రాలను నిర్వాహకుల నుంచి అందుకున్నారు.

డెంగీ, మలేరియాపై జాగ్రత్తలు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని వన్నెపూడి, కొడవలి గ్రామాల్లో శుక్రవారం గొల్లప్రోలు పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. డెంగ్యూ మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రజల దరి చేరకుండా నీటి వనరులను వారానికి ఒకసారి క్లీన్ చేసి మూతలు ఉంచి జనావాస ప్రాంతాల మధ్య నీరు నిలవలు లేకుండా చూడాలని, ఇంటింటా ఫీవర్ సర్వే చేసి రక్త పరీక్షలు నిర్వహించి జ్వరాలకు వెంటనే చికిత్స తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు అహ్మద్ బాషా, ఎస్‌కె.రజిని పాల్గొన్నారు.

మట్టి పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి-గొల్లప్రోలు

చేబ్రోలు జెడ్‌పి పాఠశాల విద్యార్థులకు మట్టి నమూనాలపై వ్యవసాయ శాఖ అధికారులు పి.మాధవి పి.స్వాతి, ఎఒ కె.విజయ్ కుమార్ శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కెవివి సత్యనారాయణ, హెచ్‌ఎం అర్జున్ రావు, ప్రభాకర్, పైలా రాజా తదితరులు పాల్గొన్నారు.

ముంపులో పొలాల పరిశీలన

ప్రజాశక్తి - సామర్లకోట



ముంపు పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

భారీ వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను పెద్దాపురం ఏరువాక శాస్త్రవేత్త శుక్రవారం పరిశీలించారు. మాధవపట్నంలో ఎఒ వంగపండు మురళీధర్ ఆధ్వర్యంలో ఏరువాక శాస్త్రవేత్త సీతారామ శర్మ పర్యటించి నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొలంలో ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలన్నారు. ఎకరానికి 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ ఎరువులను పైపాటుగా వేసుకోవాలన్నారు.

సామాన్యులకు అండగా ప్రజాదర్బార్

ప్రజాశక్తి - సామర్లకోట

సామాన్యులకు అండగా ఉండేలా ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని తీర్చిదిద్దామని, ఎవరైనా వచ్చి తమ సమస్యలపై ఇక్కడ వినతులు సమర్పించవచ్చని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శుక్రవారం సామర్లకోట పట్టణ టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చినరాజప్ప ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సుమారు 22 మంది తమ వినతులను ఎంఎల్ఎకు అందజేశారు. అధికారులతో మాట్లాడి పలు సమస్యలను ఎంఎల్ఎ పరిష్కరించారు. రాజా సూరిబాబు రాజు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, బలుసు వాసు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల తనిఖీ చేసిన కమిషనర్

ప్రజాశక్తి పెద్దాపురం

పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాత పెద్దాపురం రహదారిలోని నాయీ బ్రాహ్మణ కాలనీ నుంచి సత్తెమ్మ కాలనీ వరకూ నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు, సిమెంట్ డ్రైన్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం 9వ వార్డు జి.రాగంపేట పుంత రహదారిలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ ప్రకాశరావు, ఎఇ పివి.సుధాకర్, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపుల తొలగింపుపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి - సామర్లకోట

నియోజకవర్గ పరిధిలో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం బెల్టు షాపుల తొలగింపుపై దష్టి పెట్టాలని కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ మలకల సూర్యారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎంఎల్ఎ నిమ్మకాయల రాజప్ప ఇటీవల బ్రాందీ షాపులలో నిర్వహించిన తనిఖీలు హర్షణీయమని, ఆయన చిత్తశుద్ధి ఉంటే నియోజకవర్గమంతటా బెల్ట్ షాపులను తొలగించడమే నిజమైన చర్య అవుతుందని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-గండేపల్లి

26న భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని మండల స్థాయిలో ఏర్పాటుచేసిన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు నియోజకవర్గ స్థాయికి అనంతరం జిల్లా స్థాయికి వెళ్తారని ఎంఇఒ కెహెచ్.నాయక్ తెలిపారు దానిలో భాగంగా మండల స్థాయి భారత రాజ్యాంగ వ్యాసరచన, వక్తత్వ క్విజ్ పోటీలు శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 కె.వెంకటరెడ్డి, మల్లేపల్లి హైస్కూల్ హెచ్‌ఎం సిహెచ్.అన్నపూర్ణ, లక్ష్మణరావు, సుభాషిణి, తాతబాబు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవ పోటీలు

ప్రజాశక్తి - సామర్లకోట

-మండల స్థాయి రాజ్యాంగ దినోత్సవ పోటీలు శుక్రవారం స్థానిక అయోధ్య రామపురం మున్సిపల్ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఎంఇఒ-2 పి.పుల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఇఒ-1 వై.శివరామకృష్ణయ్య పాల్గొన్నారు. చదువుతో పాటు రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన కలిగించడానికి స్కూల్ స్థాయి విజేతలకు వ్యాసరచన, వక్తత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ, కాంప్లెక్ హెచ్‌ఎం తాండ్ర శ్యామ్ సుందర్ తోపాటు వివిధ పాఠశాలల గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ఉప్పాడ శ్రీ కనకదుర్గ ఆటో యూనియన్ అధ్యక్షునిగా కోన శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఉప్పాడలో ఉన్న 450 మంది ఆటో డ్రైవర్‌లు ఉప్పాడలోని యూనియన్ ఆఫీస్ వద్ద ఎన్నిక నిర్వహించగా శ్యామ్‌ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉప్పాడ నుంచి పిఠాపురం, కాకినాడ. అద్దరిపేట మూడు లైన్ల అధ్యక్షునిగా శ్యామ్‌ప్రసాద్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆటోడ్రైవర్లు శ్యామ్‌ప్రసాద్‌ను అభినందించారు.



గుంతల వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

రోడ్డు గుంతల వద్ద గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి - జగ్గంపేట

రామవరం నుంచి రాజుపాలెం వెళ్ళే రోడ్డు నిర్మించకుంటే గ్రామస్థులతో కలిసి ప్రభుత్వం మొద్దు నిద్ర వీడేలా చేస్తామని బురుగుపూడి మాజీ సర్పంచ్ పాఠంశెట్టి సూర్యచంద్ర హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఈ రోడ్డు గుంతల వద్ద వాహనదారులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అడుగుకో గొయ్యి - గజానికో గుంత అని గత ప్రభుత్వంపై దుమ్మెత్తి పోసిన కూటమి నాయకులు ఇప్పుడు ఈ రోడ్డు గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతున్నా ఈ రహదారి నిర్మాణ పనులు చేపట్టలేదన్నారు. ఈ రోడ్డుపై ప్రయాణించారు నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుంతలతో చెరువులను తలపిస్తున్న ఈ రోడ్డును నిర్మించకపోతే చేపల పెంపకానికి ఇవ్వాలని ఆయన ఎద్దేవా చేశారు.

పోలియో చుక్కలు వేయించాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

చిన్నారులు పోలియో మహమ్మారి బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ వైద్యుల సూచనల మేరకు పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ పోలియో నివారణ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిండు నూరేళ్ల ఆరోగ్యకరమైన చిన్నారుల జీవితానికి పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ అడ్డాల తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్ పాల్గొన్నారు.

పిఎం జీవన జ్యోతి బీమా అందజేత

ప్రజాశక్తి - జగ్గంపేట

రామవరం గ్రామానికి చెందిన దుర్గమ్మ కుటుంబానికి పిఎం జీవనజ్యోతి బీమా చెక్కును శుక్రవారం ఎస్‌బిఐ మేనేజర్ నవీన్ కుమార్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకం కింద సంవత్సరానికి రూ.436 చెల్లిస్తే ఎటువంటి మరణానికైనా రూ.రెండు లక్షల బీమా పొందవచ్చని తెలిపారు. బీమా చెల్లించిన దుర్గమ్మ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఆమె భర్త తాత బాబుకు బీమా చెక్కు అందించామని తెలిపారు.

పోలియోపై రోటరీ అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-పెద్దాపురం

ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా పెద్దాపురం-సామర్లకోట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దాపురం మండలం ఆర్‌.బి.కొత్తూరులో పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ వీధుల్లో నిర్వహించిన ఈ ర్యాలీ సందర్భంగా రోటరీ అధ్యక్షుడు తటవర్తి సత్యనారాయణ, సభ్యులు చౌదరి, తోలాపి సత్యనారాయణ, శేషు కుమార్, గంగాధరుడు పోలియోపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇప్పటివరకు రోటరీ సంస్థ పోలియో నిర్మూలన కోసం చేసిన కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్.బి కొత్తూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.